www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 16 అక్టోబర్ 2025
5
అన్నమయ్య



చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్లు ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు, ఉపాధ్యాయులు


ప్రజాశక్తి-మదనపల్లె
జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 30 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న చెకుముకి టాలెంట్ టెస్ట్ (సైన్స్ సంబరాలు) పోస్టర్లను బుధవారం స్థానిక హోప్ మునిసిపల్ హై స్కూల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెవివి అన్నమయ్య జిల్లా గౌరవాధ్యక్షులు టి.హరింద్రనాథ్ శర్మ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్ట్ల ద్వారా విద్యార్థుల్లో సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవడానికి ఉపయోగపడతాయన్నారు. 8,9,10వ తరగతుల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెవివి నాయకులు ఎన్.చంద్ర, ఉపాధ్యాయులు బెల్లం సుధాకర్, వాణి, జబ్బార్, జయరాం, షర్మిళ, చిరంజీవి, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

సాగుకు వేళాయె..విత్తనం రాకపాయె!

- మంజూరైనా పంపిణీ కాని వైనం
- నిన్న యూరియా తిప్పలు.. నేడు పప్పుశనగ విత్తనాల కోసం అవస్థలు
- పప్పుశనగకు రైతుల ఎదురుచూపులు
- రబీ సాగుకు విత్తనం ఇవ్వకుండా సర్కారు దాటవేత


పులివెందుల ప్రాంతంలో సాగుకు సిద్ధం చేసిన పొలం

ప్రజాశక్తి-పులివెందుల టౌన్
నల్లరేగడి భూముల్లో రబీలో సాగయ్యే పప్పుశనగ విత్తుకోవడానికి రైతులు దుక్కులు సిద్ధం చేసుకున్నా...రాయితీ విత్తనాలు పంపిణీ చేయకపోవడంతో ఎదురుచూపులు తప్పడం లేదు. రబీ సీజన్ పంటల సాగుకు మంచి అదును ప్రారంభమైంది. వర్షాలు కూడా సకాలంలో కురుస్తున్నాయి. సరిపడా విత్తనం, ఎరువులు అందించకుండా కూటమి సర్కారు రైతులను ఏడిపిస్తోంది. రబీ సీజన్ మొదలై 15 రోజులు కావస్తున్నా విత్తన పప్పుశనగ ఇవ్వకుండా దాటవేత ధోరణి అవలంబిస్తోంది. ఈ పాటికే విత్తన పంపిణీ పూర్తి చేయాల్సి ఉన్నా ఇప్పటికీ పంపిణీ ప్రక్రియ ప్రారంభించకపోవడం గమనార్హం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2.45 లక్షలకరాల విస్తీర్ణంలో పంట సాగులోకి రావచ్చని అధికారులు అంచనా వేశారు. రాయితీ విత్తనం ఎప్పుడిస్తారనే విషయం మాత్రం ఇంకా తేలడం లేదు. వ్యవసాయ శాఖ, ఏపి సీడ్స్ ఈ విషయంపై నోరు విప్పడం లేదు. పప్పుశనగ రైతులు విత్తనం కోసం ఎదురు చూస్తున్నారు.



నిన్న యూరియా తిప్పలు .. నేడు పప్పుశనగ అవస్థలు

నిన్నటి వరకు యూరియా కోసం తిప్పలు పడుతున్న రైతులు నేడు విత్తనం కోసం అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. బహిరంగ మార్కెట్లో అధిక ధరలు ఉండడంతో పెట్టుబడి పెరిగి సాగు భారమవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంపిణీ ఆలస్యం ఇదే మొదటిసారి

రాయితీ విత్తనం ఇవ్వకుండా జాప్యం చేయడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. రబీ సీజన్ సన్నాహకాలు ఎంత ఆలస్యమైనా అక్టోబర్ 10వ తేదీలోపు పంపిణీ మొదలు పెడతారు. 15 రోజుల క్రితమే కేటాయింపులు, ధరలు ప్రకటించినా పంపిణీ మాత్రం జరగలేదు. రాయితీ కూడా 25 శాతం మాత్రమే. అన్నింటికీ సిద్ధంగా ఉన్నా కూడా విత్తనం ఇవ్వకుండా నాన్చుడి ధోరణి అవలంభిస్తుండటం రైతులకు ఇబ్బందిగా మారింది.

విత్తనాల కేటాయింపు ఇలా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 37,641 క్వింటాళ్ల పప్పుశనగ విత్తనాలు మంజూరయ్యాయి. నియోజకవర్గవర్గాల వారీగా పులివెందులకు 7900 క్వింటాళ్లు, జమ్మలమడుగుకు 13740, ప్రొద్దుటూరుకు 3900, కమలాపురానికి 8 వేలు, మైదుకూరుకు 310, బద్వేల్కు 20 క్వింటాళ్లు కేటాయించారు. బఫర్ స్టాక్ కింద 3771 క్వింటాళ్లు మంజూరయ్యాయి. భూమి పాస్బుక్, ఆధార్ కార్డుతో సమీప రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ అధికారులు తెలిపారు. క్వింటా ధర రూ.7,800 కాగా, ప్రభుత్వం 25 శాతం రాయితీగా రూ.1,950 అందిస్తోంది. రైతులు రూ.5,850 చెల్లించి విత్తనాలు పొందవచ్చన్నారు.

బహిరంగ మార్కెట్లో క్వింటా ధర రూ.6500

బహిరంగ మార్కెట్లో క్వింటా పప్పుశనగ ధర రూ.6500 ఉంది. రాయితీ విత్తనాలు అందకపోతే రైతులు క్వింటాకు రూ.650 భారం పడనుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే విత్తనాలను పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

పెండింగ్ బకాయిలే.. పంపిణీకి ఆలస్యం

గత సంవత్సరం సరఫరా చేసిన విత్తనాలకు ప్రభుత్వం సప్లయర్స్కు బకాయిలు చెల్లించక పెండింగ్లో ఉన్నందునే సరఫరా చేయక పంపిణీ ఆలస్యం అవుతోంది. పాత బకాయిలు చెల్లిస్తే సరఫరా చేస్తామని సప్లయర్లు ప్రభుత్వానికి తెలిపారు. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే వెంటనే సమస్య పరిష్కారం అవుతుందని, పంపిణీ చేస్తామని వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు.

అదునులోనే విత్తనాలు ఇవ్వాలి

అదును పోయాక విత్తనాలు ఇచ్చినా ప్రయోజనం లేదు. ఒకటి, రెండు రోజుల్లో విత్తనాలు పంపిణీ చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. మామూలుగా దీపావళికి మొలక రావాల్సి ఉంది. విత్తనాలు లేక ఆలస్యం అవుతుంది.

- జనార్ధన్రెడ్డి, రైతు, పులివెందుల.

గతంలో ఇలా ఎన్నడూ లేదు

గతంలో విత్తనాల పంపిణీ ఆలస్యం లేదు. అక్టోబర్ మొదటి వారంలోనే విత్తనాలను పంపిణీ చేసేవారు. ప్రస్తుతం ఆలస్యం కావడం వల్ల పంట వేయడం లేదు. ఆలస్యం అవుతుండటంతో రైతుకు నష్టం వస్తుంది.

- మదన్మోహన్రెడ్డి, రైతు, లింగాల.

యాప్ సమస్య ఉంది

యాప్ సమస్య ఉన్నందున బుకింగ్ విత్తనాల పంపిణీ ఆలస్యం అవుతోంది. రెండు రోజుల్లో సమస్య పరిష్కారమవుతుంది. గురువారం ఎప్పుడు పంపిణీ చేయాలో అన్నది తెలుస్తుంది. యాప్ పనిచేసిన వెంటనే రైతు భరోసా కేంద్రాలలో రైతుల వివరాలను నమోదు చేసుకుని శనగ విత్తనాలు పంపిణీ చేస్తాం.

- ప్రభాకర్రెడ్డి, ఏడిఏ, పులివెందుల.

హెచ్ఎన్ఎస్ఎస్ కాలువకు భారీ గండి

- యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు
- పరిశీలించిన కలెక్టర్ నిశాంత్ కుమార్


హెచ్ఎన్ఎస్ఎస్ కాలువకు పడిన గండి నుంచి వృధాగా పోతున్న నీరు

ప్రజాశక్తి-బి.కొత్తకోట
మండలం గుండ్లపల్లి గ్రామ పరిధిలోని 110వ కిలోమీటర్ దగ్గర ఉన్న హంద్రీ-నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) పుంగనూరు బ్రాంచ్ కాలువకు బుధవారం మధ్యాహ్నం భారీ గండి పడింది. కాలువలో నుంచి నీరు వృధాగా పోయింది. ఇంజినీరింగ్ అధికారులు యుద్ధప్రాతిపదిక పునరుద్ధరణ పనులు చేపట్టారు. కాలువకు గండి పడిన విషయం తెలుసుకున్న కలెక్టర్ నిశాంత్ కుమార్ హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజినీర్లతో కలిసి కాలువ దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించి, నీటి ప్రవాహం ఎటు వెళ్తుందో వివరాలు అడిగారు. ఇంజినీర్లు సమాధానమిస్తూ కాలువ నుండి సమీపంలోని చెరువులకు నీటిని మళ్లిస్తున్నామని తెలిపారు.


గండిని పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్కుమార్

భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసి, సమీప చెరువులకు నీటిని సురక్షితంగా మళ్లించే ఏర్పాట్లు చేయాలని, వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీర్లకు ఆదేశాలు జారీ చేశారు. హంద్రీ-నీవా కాలవ సమీప గ్రామాలలోని జెసిబి ట్రాక్టర్ ఓనర్ లను వీఆర్వో, ఫీల్డ్ అసిస్టెంట్, సర్పంచు, కొంతమంది కూలీలతో సమావేశాలు ఏర్పాటు చేసి ఇలాంటి అత్యవసర పరిస్థితులలో ఏ వేళలోనైనా వచ్చేందుకు సిద్ధంగా ఉండే విధంగా తరచుగా సమావేశాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏదైనా ఇలాంటి పరిస్థితి ఏర్పడే అవకాశం ముందుగానే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేసి ఇలాంటి పంట ప్రాణానిష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కాలువకు గండి పడినప్పుడు తాము ఇబ్బందులు పడుతున్నామని త్వరగా బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని కలెక్టర్ను గుండ్లపల్లి ప్రజలు కోరగా దీనికి సంబంధించి ప్రపోజల్ ఉన్నదని త్వరగా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని వారికి తెలిపారు.

రాష్ట్రానికి ద్రోహం చేసిన మోడీ గోబ్యాక్ : సిపిఎం


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్
రాష్ట్రానికి ద్రోహం చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఏ ముఖం పెట్టుకుని రాష్ట్రానికి వస్తున్నారని, గో బ్యాక్ ప్రధానమంత్రి మోడీ' అంటూ సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు ధ్వజమెత్తారు. బుధవారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్రమోడీ జిఎస్టి సుంకాల తగ్గింపు ఘనకార్యం గురించి మాట్లాడేందుకు గురువారం కర్నూలుకు వస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల కాలంలో నాలుగు సార్లు రాష్ట్రానికొచ్చారని, ఊకదంపుడు ఉపన్యాసం తప్ప, ఒక్కసారైనా ప్రజలకు మేలు చేసే పని చేశారని ప్రశ్నించారు. దేశ ప్రధాని మోడీ తన మాటల గారడితో రాష్ట్ర ప్రజలను ఎన్నిసార్లు మోసం చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రంప్ సుంకాల టెర్రరిజం, హెచ్1బి వీసా ఫీజు పెంపు వల్ల నేడు దేశంలోని యువత, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, ముఖ్యంగా వ్యవసాయ రంగం తీవ్ర ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన సందర్భంగా రాష్ట్రానికి చట్టబద్ధంగా ఇచ్చిన ప్రత్యేకహోదా, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్రత్యేక ప్యాకేజి, పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణం, కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి పూనుకోకపోగా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను మొండిగా అమలు చేస్తున్నారని విమర్శించారు. జిఎస్టి తగ్గింపు వల్ల రాష్ట్ర ఖజానాకు రూ.9 వేల కోట్ల లోటు వచ్చిందన్న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆ లోటు పూడ్చాలన్నారు. రాష్ట్ర ప్రజల తరపున మోడీని నిలదీసే సత్తా ఉందా అని ప్రశ్నించారు. సమావేశంలో సిపిఎం నాయకులు ప్రభాకర్రెడ్డి పాల్గొన్నారు.

టపాసుల దుకాణాలకు అనుమతి తప్పనిసరి : డిఎస్పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : టపాసుల దుకాణాలకు అనుమతులు తప్పనిసరని డిఎస్పి మహేంద్ర తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో రెండు దుకాణాలకు మాత్రమే పెర్మనెంట్ లైసెన్సులు ఉన్నాయని, మిగతావన్నీ తాత్కాలికమైనవేనన్నారు. ఇప్పటికే 20 దుకాణాలకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవడం జరిగిందని, వారి దరఖాస్తులను పరిశీలించిన అనంతరం సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో లైసెన్సులు మంజూరు చేస్తానన్నారు. నిర్వాహకులు నిబంధనలకు అనుగుణంగా దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా లైసెన్సులకు దరఖాస్తులు చేసుకోకుండా, ఎలాంటి అనుమతులు లేకుండా దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. దుకాణాలను సీజ్ చేయడంతో పాటు నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకు ంటామని హెచ్చరించారు. ఇటీవల కాలంలో హంద్రీనీవా కాలువలో కొంతమంది ఈతలకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకు ంటున్నారని, అది నిషేధిత ప్రాంతమన్నారు. హంద్రీనీవా కాలవ ల్లోకి ఈతలకు వెళ్లడం, చుట్టూ పరిసర ప్రాంతాలలో మద్యపానం సేవించడం నిషేదమన్నారు. డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టి నిభందనలను అతిక్రమించిన వారిని గుర్తించి తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీపావళి పండుగను పురస్కరించుకొని పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు ఇప్పటికే ట్రాఫిక్ పోలీసులతో సమావేశం నిర్వహించామన్నారు. ట్రాఫిక్ స్తంభించే ప్రాంతాలను గుర్తించి ఆ వాహనాలను దారి మళ్లించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. ప్రజలందరూ పోలీసులు పెట్టిన నిబంధనలకు అనుసరించి శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని కోరారు.

రైల్వేలైన్కు నిధులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి-రాయచోటి: రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడప నుంచి రాయచోటి, మదనపల్లెల మీదుగా బెంగుళూరు రైల్వే లైన్ కు నిధులు మంజూరు చేసి కరువు కాటకాలతో అల్లాడుతున్న రాజకీయ నిర్లక్ష్యానికి గురియైన రాయలసీమ అభివృద్ధికి దోహద పడాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలోని ఆదోని, మదనపల్లె, మార్కాపురం ప్రభుత్వ వైద్య కళాశాలను జిఒ ఆర్టీ నెంబర్ 590 ద్వారా ప్రయివేట్ పరం చేసే ప్రయత్నాలను తక్షణం విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కర్నూలులో జరిగే బహిరంగ సభలో మోడీ సమస్యలపై, అభివృద్ధిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: పరిశుభ్రత, మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు 5వ వార్డు టిడిపి ఇన్ఛార్జి కొప్పల హరినాథ్ పేర్కొన్నారు. బుధవారం వార్డు పరిధిలో చెత్తచెదారం పేరుకుపోవడంతో శుభ్రం చేయించారు. పైప్ లైన్ దెబ్బతినడంతో సొంత నిధులతో మరమ్మతులు చేయించి ప్రజలకు నీటి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా హరినాథ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే షాజహాన్బాషా సహకారంతో ఇప్పటికే వార్డులో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ముఖ్యంగా ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టామని, మరమ్మతుకు గురైన బోరుకు పైపులు, మోటార్ అమర్చి ప్రజల దాహార్తిని తీర్చడం జరిగిందన్నారు. వార్డు ప్రజల శ్రేయస్సుకు పని చేస్తున్నన్నారు. నాయకులు, అధికారుల సహకారంతో వార్డును మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రజలు సైతం వార్డు పరిశుభ్రతకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ పడవేయకుండా మున్సిపాలిటీ వారు ఏర్పాటు చేసిన చెత్తకుండీలలోనే వేయాలని సూచించారు. వార్డు ప్రజలకు ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.


పారిశుధ్య పనులు చేయిస్తున్న హరినాథ్

వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయం

- కలెక్టర్ నిశాంత్ కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి-రాయచోటి
వాతావరణ మార్పులకు అనుగుణంగారైతులు సన్నద్ధం కావాలని కలెక్టర్ నిశాంత్కుమార్ పేర్కొన్నారు. వ్యవసాయంలో మార్పులు పైలెట్ ప్రాజెక్టుకు జిల్లాలోని లక్కిరెడ్డిపల్లి, చిన్న మండెం మండలాలు ఎంపిక కావడం సంతోషకరమని, రైతులు వాతావరణ మార్పుల వల్ల కలిగే ప్రభావాలకు సన్నద్ధంగా ఉండి, ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో యునైటెడ్ నేషన్స్ వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం రెండు రోజుల జిల్లా స్థాయి వర్క్షాప్లోలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఉపాధి మార్గాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో ఒరిస్సా, తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్ మూడు రాష్ట్రాల్లో పైలెట్ ప్రోగ్రామ్గా ఎంపిక కావడం అందులో రాష్ట్రం నుంచి అన్నమయ్య జిల్లా లోని వెనుకబడిన మండలాలుగా ఉన్న లక్కిరెడ్డిపల్లి, చిన్నమండెం ఎంపిక కావడం హర్షణీమన్నారు. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ అన్యూహ మార్పులు రావటం పెద్ద సమస్యగా మారిందని వర్షాలు పడే కాలంలో వర్షాలు తక్కువగా ఉండడం పంటలు పండే సమయంలో వర్షాలు రాకుండా ఆగిపోవడం, పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలతో పంట నష్టాలు జరగడం జరుగుతోందన్నారు. అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్గా పనిచేసిన సమయంలో అనుభవాన్ని ప్రస్తావిస్తూ అకస్మాత్తుగా మారే వర్షపాతం వల్ల ఏ విధంగా పంటలు దెబ్బతింటాయో ప్రత్యక్షంగా చూశానని, అందుకే ఇలాంటి ప్రాజెక్టులు చాలా ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. రైతులకు వాతావరణ మార్పుల గురించి అవగాహన కల్పించి వ్యవసాయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ అడాప్ట్ 4అర్ ప్రాజెక్ట్ కింద లక్కిరెడ్డిపల్లి, , చిన్నమండెం మండలాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆ మండలాలలో రైతుల జీవనాధార కార్యకలాపాలు, పంట పద్ధతులు, వాతావరణ పరిస్థితులు మొదలైన అంశాలపై సమగ్ర అధ్యయనం చేసి, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రైతులు, అధికారులు కలిసి ఒక సమగ్ర యాక్షన్ ప్లాన్ రూపొందించి, ఈ ప్రాజెక్ట్ ద్వారా గరిష్ట ప్రయోజనం పొందేలా కృషి చేయాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. జిల్లా, మండల,గ్రామ స్థాయి అధికారులతో సమన్వయం చేసుకొని ఎప్పటికీ అప్పుడు సమాచారాన్ని పంచుకొని ఏ విధంగా ఒక మంచి యాక్షన్ ప్లాన్ తయారు చేయాన్నారు. జాతీయ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బాలాజీ త్రిపాటి మాట్లాడుతూ ఈ పథకం మన దేశంలోమూడు రాష్ట్రాలలో అమలవుతోందని, చిన్నమండెం, లక్కిరెడ్డిపల్లి మండలాలు 20 గ్రామాల్లో రైతుల జీవన విధానం మార్పులకు దోహదమవుతుందని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి జి.శివనారాయణ మాట్లాడుతూ జిల్లాలో వర్షాభావ పరిస్థితుల వలన రైతాంగం వరుస కరువులను చవిచూడాల్సిన పరిస్థితి వస్తుందని వీటిని ప్రత్యామ్నా యంగా ఈ పథకం ద్వారా గ్రామస్థాయిలోని చిన్న సన్నకారు రైతులకు ఉపయోగపడే విధంగా రూపకల్పన చేయాలని సూచించారు. కార్య క్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి బి.వెంకటమోహన్, జిల్లా ఉద్యానశాఖ అధికారి సుభాషిని, జిల్లా పశు సంవర్ధక, పశుసంవర్ధక శాఖ అధికారులు, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి, జిల్లా ఫిషరీస్ డిపార్ట్మెంట్ అధికారి సుస్మిత, జిల్లా నీటి యాజమాన్య సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మల్ రెడ్డి, అటవీశాఖ జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారులు, ఎన్జిఒలు, ఎఫ్ పిఒ, ఎస్హెచ్జి గ్రూపు మహిళా సభ్యులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని ప్రయివేటు ఆస్పత్రి సీజ్


అశ్విని ఆస్పత్రిని సీజ్ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పీలేరు
పీలేరులో అగ్నిమాపక శాఖ అనుమతులు లేని అశ్విని ఆస్పత్రిని సీజ్ చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య, డెమో అధికారిణి దేవశిరోమణి తెలిపారు. ఆసుపత్రి నిర్వహణలో కీలకంగా భావించే అగ్నిమాపక శాఖ అనుమతులు లేకుండా, రాకుండానే ఆసుపత్రి నిర్వహించడం, ఆసుపత్రిలో కాన్పులు, ఆపరేషన్లు చేయడం చట్టవ్యతిరేకమంటూ బుధవారం వారు ఆసుపత్రిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీలేరులోని అశ్విని హాస్పిటల్ యాజమాన్యం ప్రభుత్వ అనుమతుల కోసం ఈ ఏడాది ఫిబ్రవరిలో దరఖాస్తు చేసుకున్నారని, మార్చి మాసంలో వారి దరఖాస్తు తిరస్కరణకు గురైందన్నారు. అనుమతులు లేకుండా ఆసుపత్రి నిర్వహించరాదని తెలిసినా వారు పట్టించుకోలేదని, స్పందన కార్యక్రమంలో తమకు అందిన ఫిర్యాదు మేరకు తాము క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆసుపత్రిని సీజ్ చేశామన్నారు. ఆసుపత్రి నిర్వాహకులు పూర్తి అనుమతులు తీసుకున్న తరువాత ఆసుపత్రిని తిరిగి నిర్వహించుకోవచ్చని స్పష్టం చేశారు. అయితే తమ దరఖాస్తు తిరస్కరణకు గురైన తరువాత జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో సంబంధిత అధికారులు సెలవులో ఉండడంతో తాము ముందుకు వెళ్లలేకపోయామని, తమకు కాస్త సమయం ఇస్తే అన్ని అనుమతులు తీసుకుంటామని ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ శ్రమంత్ కుమార్ రెడ్డి అధికారులను కోరారు. అగ్నిమాపక శాఖాధికారులు సూచించిన విధంగా ఆసుపత్రి భవనానికి కొన్ని మార్పులు చేయాల్సి రావడంతో భవన యజమానితో మాట్లాడుతున్నామని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సీజ్ చేయక తప్పదంటూ అధికారులు ఆసుపత్రిని సీజ్ చేశారు. మల్లెల గ్రౌండ్లోని మాధవి ఆసుపత్రిని కూడా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య, డెమో అధికారిణి దేవశిరోమణి, ఆర్బీఎస్కే జిల్లా ప్రోగ్రాం అధికారి ప్రసాద్ నాయక్ బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఆసుపత్రి నిర్వాహకురాలైన డాక్టర్ మాధవి ప్రస్తుతం అందుబాటులో లేరని, అయితే ఆసుపత్రిలో రికార్డులన్నీ సక్రమంగా ఉన్నాయని పరిశీలన అనంతరం అధికారులు మీడియాకు వివరించారు.


సిపిఆర్ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య బృందం

సిపిఆర్ సాధనతో ప్రాణానికి భరోసా

- డిప్యూటీ హెచ్ఇఒ సి.కొండయ్య

ప్రజాశక్తి-పీలేరు: ప్రాణానికి బరోసానిచ్చే సిపిఆర్ సాధన అందరి బాధ్యతని తలుపుల పిహెచ్సి డిప్యూటీ హెచ్ఇఒ సి.కొండయ్య తెలిపారు. బుధవారం పట్టణ ప్రభుత్వ ఐటిఐ విద్యార్థులకు కార్డియో పల్మనరీ రీసెటేషన్ (సిపిఆర్) సాధనపై అవగాహన కల్పించారు. విద్యుత్ షాక్, నీటిలో మునగడం లాంటి సంఘటనలతో గుండె పనితీరు ఆగినప్పుడు సిపిఆర్ సాధన అత్యవసరమని అన్నారు. ఆ సమయంలో ఊపిరితిత్తులకు స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించడంలో భాగంగా బాధితుల నోట్లో నోరు పెట్టి ఊదుతూ గాలి అందించాల్సిన ఆవశ్యకత కూడా ఉంటుందని వివరించారు. ఇలాంటి బాధితుని నేలపై వెల్లకిలా పడుకోబెట్టి గమనిస్తూ రెండు చేతులతో ఛాతీ మధ్యలో బలంగా 30 సార్లు వరుసగా ప్రెస్ చేస్తుండాలని, స్పృహ వచ్చేవరకు చేసే సాధన ఫలితంగా బాధితుల శరీర భాగాలల్లో తిరిగి రక్త ప్రసరణ అయ్యేటట్లు చేస్తుందని, ఈలోపు అంబులెన్స్ సహాయంతో ఆసుపత్రికి చేర్చాలన్నారు. ఈ విధానం ద్వారా చాలామంది బ్రతికిన విషయం కొండయ్య విద్యార్థులకు గుర్తుచేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ మునిస్వామి, ఆదినారాయణ, ఇన్స్ట్రక్టర్, ఏఎన్ఎంలు ప్రమీల, కృష్ణమ్మ, సిహెచ్ఓ లావణ్య, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు వాహన కటౌట్ను ఏర్పాటు చేసినట్లు డిఎస్పి మహేంద్ర తెలిపారు. కురబలకోట మండలం, ముదివేడు సమీపంలో ఇటీవల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో రూరల్ సిఐ సత్యనారాయణ, ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ వినూత్న ఆలోచన చేసి రోడ్డు ప్రక్కన పోలీసు వాహనం నిలిపి ఉన్న కటౌట్ను ఏర్పాటు చేశారు. ఈ కటౌట్ను బుధవారం డిఎస్పి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల వల్ల విలువైన ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని, దీనివల్ల కొన్ని కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. ప్రజలు తమ కుటుంబాలకు దృష్టిలో పెట్టుకొని వాహనాలు నడపాల్సి ఉందన్నారు. ముదివేడు సమీపంలోని కడపక్రాస్, తానా మిట్ట అటవీ ప్రాంతంలో ఉండడం, వాహనాల తాకిడి ఎక్కువగా ఉండటంతో ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయన్నారు. వీటిని అరికట్టేందుకు వినూత్న ఆలోచనతో సిఐ, ఎస్ఐ నిలిపి ఉన్న పోలీసు వాహన కటౌట్ను ఏర్పాటు చేశారని చెప్పారు. దీనివల్ల వాహనదారులు దూరం నుంచి పోలీసు వాహనం ఉన్నట్లు గ్రహించి వేగాన్ని తగ్గించుకొని వాహనాలు నడపడం జరుగుతుందని, తద్వారా ప్రమాదాలు అరికట్టే వీలుంటుందన్నారు. ఇలాంటివన్నీ చేసినప్పటికీ ప్రజలు సంయమనం పాటించి నిదానంగా తమ వాహనాలు నడిపినప్పుడే ప్రమాదాల బారి నుంచి బయటపడవచ్చుని తెలిపారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం గురువారం పట్టణంలోని విద్యుత్ డివిజన్ ఆఫీస్ దగ్గర ప్రత్యేక విద్యుత్ లోక్ అదాలత్ను నిర్వహిస్తున్నట్టు రాయచోటి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యుగంధర్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలైన బిల్లుల సవరణలు, కనెక్షన్ సమస్యలు, మీటర్ మార్పులు, ఓల్టేజ్ సమస్యలు, లైన్ ఫాల్ట్ తదితర ఫిర్యాదులను అధికారులకు సమర్పించవచ్చునన్నారు. కార్యక్రమంలో లోకదాలత్ చైర్మన్ శ్రీనివాస్, రిటైర్డ్ జడ్జి ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు మధుకుమార్ ,సాంకేతిక సభ్యులు శ్రీనివాస్ బాబు, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మిలు, వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తానన్నారు.

వర్షం వచ్చిందంటే వంతెన మునగాల్సిందే

గాలివీడు-మదనపల్లి ప్రయాణానికి అంతరాయం

ప్రజాశక్తి గాలివీడు

మండలంలోని అరవీడు పంచాయతీ ఎల్లంపల్లి సమీపంలో కుషావతి మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గాలివీడు-మదనపల్లి వెళ్లే వంతెన మార్గం నీటితో నిండిపోయింది. ప్రాజెక్ట్ నుంచి నీరు వంతెనపై ప్రవహిస్తుండటంతో మదనపల్లి-గాలివీడు వెళ్లే ఆర్టీసీ బస్సుల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. కుషా వతినది పైన ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా స్థానిక ప్రజలు చెబు తున్నారు. అనవసరమైన ప్రాంతాలలో ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, తూములు నిర్మిస్తున్నారని, అవసరమైన చోట నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇక్కడి సమస్య పరిష్కరించడంలో అధికా రులు, పాలకులు చొరవ చూపడం లేదని విమర్శిస్తున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు తప్పని పరిస్థితుల్లో వంతెనపైనే వెళ్లాల్సి ఉంటోందని, ఒకవేళ నీరు ఉధృతి పెరిగితే ప్రమాదం చోటు చేసుకునే అవకాశముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి పెట్టి ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.


కుషావతి నది మొరిపైన ప్రవహిస్తున్న నీరు


సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ప్రజలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. మండలంలోని వెంకటరెడ్డిపల్లిలో బుధవారం సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. రాచపల్లి ఆంజనేయస్వామి దేవస్థానం, కోనమల్లాలమ్మతల్లి, శివాలయం దేవస్థానం ఎనిమిది విద్యుత్ స్తంభాలు, మినీ ట్రాన్స్‌ఫార్మర్, గ్రావెల్ రోడ్డు నిర్మాణం, 40 సంవత్సరాల నిరీక్షణకు కార్య రూపం దాల్చిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజా సౌకర్యార్థం సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభమవ్వడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టిడిపి ఇన్‌ఛార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి సారథ్యంలో ప్రజల స్వప్నం నెరవేరిందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, పరశు రాం రెడ్డి, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలకలు పంపిణీ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల కేంద్రం లక్కిరెడ్డిపల్లిలో ఎంపిపిఎస్ ఎస్ మెయిన్ స్కూల్, ఎంపిపి ఎస్ టీచర్స్ కాలనీ స్కూల్, ఎంపిపిఎస్ ఈస్ట్ స్కూల్‌లో చదివే విద్యార్థులకు డిస్ట్రిక్ట్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో పలకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఇఒ చక్రేనాయక్, క్లస్టర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక పాఠశాలలో ఆటపాటల ద్వారా విద్యను ఇష్టంగా అభ్యసించాలన్నారు. డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ మాట్లాడుతూ పలకల పంపిణీ కార్యక్రమానికి రాయచోటి వీరభద్రస్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి డివి రమణారెడ్డి సహాయ సహకారాలు అందించారని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అమరనాథ్, హెచ్.శ్రీనివాసులు, రాధమ్మ, సువర్ణముఖి వేమిరెడ్డి, సుబ్బారెడ్డి, ముక్తియర్, అహ్మద్, గంగాధర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పలకలు పంపిణీ చేస్తున్న ఎంఇఒ చక్రేనాయక్

రేపు విద్యుత్ కార్మికుల సమస్యల కోసం నిరసనలు

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

ఏపి విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ అక్టోబర్ 15న జరగాల్సిన సమ్మె వాయిదా పడిన కారణంగా 17న మధ్యాహ్నం 3 గంటల నుంచి విద్యుత్ సౌధాలో పవర్ జెఎసితో చర్చలు జరుగుతాయని స్ట్రగుల్ కమిటీ నాయకులు, రాష్ట్ర ఆర్గనైజేషన్ కార్యదర్శి కనపర్తి కిరణ్‌కుమార్ తెలిపారు. విద్యుత్ సంస్థలో చర్చల పేరుతో కమిటీల పేరుతో మసి పూసి మారేడు కాయ చేసే పద్ధతులు ఆపాలని 17న చర్చలు జరగని పక్షంలో రాష్ట్రంలో 27 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు, మరో 30 వేల మంది ఉద్యోగులు ఎంతో ఆత్రుతతో ఎదురు చూస్తున్నారన్నారు. అన్ని జిల్లాల్లో ఎస్ఇ కార్యాలయాల ఎదుట, డివిజన్ ప్రాంతాలలైతే డిఇ, ఎఇ కార్యాలయాల ఎదుట ధర్నా, డ్రైయిన్యుప్ వంటి నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర నాయకులు సుబ్రహ్మణ్యం, సిహెచ్ నారాయణ, యు రమేష్, ఎస్ సుధాకర్, ఎవి.రమణ, జయకృష్ణఆది నారాయణ,హేమకుమార్ పాల్గొన్నారు. **రాయచోటి అర్బన్:** శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎస్ఇ, డిఇ, ఎఇ కార్యాలయాల ఎదుట నిరసన తెలిపేందుకు విద్యుత్ కార్మికులు సిద్ధంగా ఉండాలని రాయచోటి స్ట్రగుల్ కమిటీ నేతలు సుబ్రమణ్యం రాజు, రమణ పిలుపునిచ్చారు. సమస్యను పరిష్కారం కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెర వేర్చేందుకు నిర్దిష్ట గడువును ప్రకటించకపోవడం దారుణమన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేయాలని అంశంపై యాజమాన్యం పూర్తి స్థాయిలో చేతులు ఎత్తేయడం తగదన్నారు. కార్మికులకు 2022 పిఆర్‌సి అరి యర్స్ బకాయిలు, షిఫ్ట్ ఆపరేటర్లు అందరికీ ఒకే వేతనం, బిల్ కలెక్టర్లు, మీటర్ లీడర్లు, స్టోర్ హమాలీలకు, ఉద్యోగ భద్రత, ప్రయివేట్ డిస్కౌంట్, ప్రైవేటీకరణ విధానాలు వంటి అంశాల పైన ప్రభుత్వం నుంచి స్పష్టమైన రాతపూర్వకమైన ఒప్పందం లేకుండా సమ్మెను పోరాటాన్ని విరమించకూడదని కోరారు.

ఆర్‌డబ్ల్యూఎస్ డిఇకి పితృవియోగం


ప్రజాశక్తి- రైల్వేకోడూరు : ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ మద్దిన మహేశ్వర తండ్రి మద్దిన వెంకటస్వామినాయుడు(85) గత వారం రోజులుగా అనారోగ్యంతో చికిత్స పొందుతూమృతి చెందారు. ఆయన స్వగ్రామమైన చియ్యవరం కమ్మపల్లిలోని స్వగృహంలో వెంకటస్వామి భౌతిక కాయానికి టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాధనాయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, సర్పంచులు సర్పంచ్ దార్ల చంద్రశేఖర్,సర్పంచ్ హరికృష్ణ రెడ్డి, చాకిరేవుకోన నీటి సంఘం అధ్యక్షులు మద్దిన సుబ్బరాఘవులు నాయుడు, సుబ్రహ్మణ్యం రాజు,బూత్ ఇంచార్జ్ ఏదోటి సత్యనారాయణ,ఏదోటి జ్యోతి రామ్,కస్తూరి శివనివాళులర్పించారు.

ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలి :'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట : ప్రజా సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్ మోహన్ రాజు అధికారులకు సూచించారు. బుధవారం టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించి అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా వచ్చిన అర్జీలను చమర్తి స్వీకరించారు. అనంతరం ప్రధాన సమస్యలను పరిష్కారం కోసం సంబంధిత ఉన్నతాధికారులకు పంపించారు. సాధారణ సమస్యలను అక్కడే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో నాయకులు, ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

పేదలకు సిఎం సహాయ నిధి ఒక వరమని చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పార్టీ నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందించారు. ఎం.పురుషోత్తం రూ.3.20లక్షలు, షేక్ రహమతుల్లా రూ.26,9209లు, పులి సుబ్రమణ్యం రూ.20,524, అత్తంజేరి రాజేష్ రూ.43,734లు, కొనెశెట్టి పిచ్చయ్య రూ.20వేలు, మన్నేరు జయహరి రూ.86,178, వక్కాల గౌరీ శంకర్ రూ 49,067లు, దొమ్మరాజు లక్ష్మీనారాయణ రాజు రూ.11వేలు, భారతాల అమ్మని రూ.43,184లు, ఎద్దుల రామకృష్ణయ్య రూ.50,984లు, వెంకటరమణ రూ.68,987లు, బాచెట్టిగారి లక్ష్మీదేవి రూ.23,603, గొల్ల వెంకటయ్య రూ.73,210, కొమ్మి కోటేశ్వర, రూ.32,500 చెక్కులను అందించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి అనేక కుటుంబాలకు ఆశా కిరణంగా మారిందని, తద్వారా ఎన్నో ప్రాణాలను కాపాడబడుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకుల్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


బాధితులకు సిఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్న జగన్‌మోహన్‌రాజు

స్థూలకాయాన్ని అదుపులో ఉంచుకోవాలి



మాట్లాడుతున్న ఎంఇఒ నారాయణ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

స్థూలకాయాన్ని అదుపులో ఉంచుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంఇఒ నారాయణ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ భవనంలో అంగన్వాడీ సూపర్వైజర్లు ధనలక్ష్మి, కుసుమారాణి నిర్వహించిన మండలస్థాయి పోషణ మాసోత్సవ కార్యక్రమానికి అయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. అంగన్వాడీ సూపర్వైజర్లు మాట్లాడుతూ ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా మండలంలో పోషక ఆహారం ఆవశ్యకతపై అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. మనిషి ఆరోగ్యానికి స్థూలఖాయం ప్రధాన అవరోధమన్నారు. అధిక బరువుతో ఏర్పడే స్థూలకాయాన్ని నివారించుకోవాలంటే మనం తీసుకునే ఆహారంలో చక్కెర, ఉప్పు, నూనె వినియోగాన్ని తగ్గించాలన్నారు. వీటిని అధికంగా వాడితే అనారోగ్యం బారిన పడతా రని సూచించారు. క్రమం తప్పకుండా కొద్దీపాటి వ్యాయామాలను చేయాలన్నారు. శిశువు, చిన్నపిల్లల సంరక్షణలో పురుషులు స్త్రీలతో కలిసి భాగస్వామ్యం కావాలన్నారు. ప్రస్తుత రోజులలో అందరూ ఆహారపు అలవాట్లను మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే జంక్ ఫుడ్ కు విపరీతంగా ఆకర్షితులవుతున్నారని, తద్వారా అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారని వివరించారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, కోడి గుడ్లు మనకు రోజు వారి ఆహారంలో భాగం కావాలని పేర్కొన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న సూక్తిని మరవకూడదని సూచించారు. పోషకాహారాన్ని ప్రతి ఒక్కరూ తప్పకుండా తీసుకో వాలన్నారు. పోషక ఆహారం ఆవశ్యకతపై అంగనవాడి కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించా లన్నారు. కార్యక్రమంలో ఎపిఒ రమేష్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు బి.ధనలక్ష్మి, కె.కుసుమ రాణి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ నాయక్, అంగనవాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వ అధికారులు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేసుకుని పనిచేయాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పీలేరు, కలకడ మండలాల పరిధిలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో కలసి ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీల వారీగా నాయకులు, అధికారులను పిలిచి మాట్లాడారు. అధికారులు నాయకులను సమన్వయం చేసుకుంటూ పనులు చేయాలని, అభివృద్ధికి ఆటంకం లేకుండా ఒకరికొకరు సహకరించుకుని ముందుకు సాగాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యపై ఎక్కడక్కడ పైపులైన్లు పగిలిపోయి సమస్య తలెత్తుతోందన్న విషయాలను నాయకులు, అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.అన్ని పంచాయతీల పరిధిలో భూ సమస్యలు, ముటేషన్ సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, వాటిని పరిష్కరించే విధంగా చూడాలని నాయకులు ఎమ్మెల్యేను కోరారు. విద్యుత్ అంతరాయం, పట్టణాల పరిధిలో పారిశుధ్య లోపంతో తలెత్తే సమస్యలు, మురుగు నీటిపారుదలకు చేపట్టాల్సిన పనులను కూడా ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సమస్యలు విన్న ఎమ్మెల్యే అధికారులు విధిగా తమ పరిధిలోని సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులపై రాజకీయంగా ఎలాంటి ఒత్తిడి ఉండబోదని, ఇక్కడ పనిచేయలేని వారు మరెక్కడా పనిచేయలేరని ఎమ్మెల్యే చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలకు తావు లేకుండా జాగ్రత్త తీసుకోవాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కూటమి సంబంధించిన నాయకులు కార్యకర్తలు వస్తే అధికారులు స్పందించాలని ఆయన కోరారు. కొంతమంది అధికారులు తమ మాట వినడం లేదని నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ఇలా అయితే సహించేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ పురం రామ్మూర్తి, సింగిల్ విండో అధ్యక్షులు యల్లెల రెడ్డప్ప రెడ్డి, ట్రాన్స్‌కో ఇఇ చంద్రశేఖర్ రెడ్డి, హౌసింగ్ డిఇ రమణయ్య, తహశీల్దారు శివకుమార్, ఎంపిడిఒ శివశంకర్, ఎపిఎం జవహర్, ఎపిఒ అశోక్, నాయకులు కోటపల్లె బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మీకర్, డాక్టర్ మల్లెల రెడ్డిబాష, అమరనాథరెడ్డి, శ్రీనాథరెడ్డి, నరేశ్, జనసేన నాయకులు కలప రవి, మోహనకృష్ణ, సుబ్బయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు. **కలకడ :** ప్రజల సమస్యలు పరిష్కారమే ఎజెండాగా పెట్టుకుని అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కలకడ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ప్రతినిధులు, అధికారుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పంచాయతీల వారీగా నాయకులు అధికారులతో పిలిచి మాట్లాడారు. అధికారులు నాయకులకు సమన్వయం చేసుకుంటూ పనులు చేయాల్సి ఉంటుందని అభివృద్ధికి ఆటంకం లేకుండా ఒకరికొకరు సహకరించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ః కార్యక్రమంలో నియోజకవర్గ రైతు ఉపాధ్యక్షులు మల్లారపు రవి ప్రకాష్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు పొత్తూరి ప్రభాకర్ నాయుడు, సింగిల్ విండో అధ్యక్షులు మద్దిపట్ల వెంకటరమణ నాయుడు, మార్కెటింగ్ యాడ్ డైరెక్టర్ ముబారక్ అలీ, మాజీ జడ్‌పిటిసి తిరుపతినాయుడు, మాజీ ఎంపిపి వంగిమల్ల మధుసూదనరెడ్డి, టిడిపి నాయకులు కాంతారావు, బివిస్వామి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, జిలానిబాషా, ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.


పీలేరు : సమావేశంలో మాట్లాడుతున్న నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి



మదనపల్లి :అంబేద్కర్ జయంతి వేడుకల్లో విద్యార్థులు

అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మాజీ రాష్ట్రపతి, డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయమని చైతన్య సంస్థ నిర్వాహకులు ఎంపి ఆనందన్ తెలిపారు. బుధవారం చైతన్య సంస్థలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. భారతదేశ 11వ రాష్ట్రపతి, మిసైల్ మాన్ ఆఫ్ ది ఇండియాగా కీర్తి గడించి భారతరత్న, పద్మ భూషణ్ పురస్కారాలు అందుకున్నారన్నారు. కార్యక్రమం డాక్టర్ జివిఎస్‌బాబు, విద్యార్థులు, వృద్దులు పాల్గొన్నారు. **రాయచోటి:** పట్టణంలోని శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాలలో భారతరత్న, మాజీ అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ జి. మనోజ్ కుమార్ మాట్లాడుతూ ప్రతిభకు పేదరికం అడ్డు కాదని, పట్టుదల కష్టపడి పనిచేయడం ద్వారా ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని పేర్కొన్నారు. **బి.కొత్తకోట :** దేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు కంచి బలరాంరెడ్డి, వైసిపి పట్టణ కన్వీనర్ సి.ఆర్ చిన్నికృష్ణ పేర్కొన్నారు. అబ్దుల్ కలాం 94వ జయంతి వేడు కలను స్థానిక బైపాస్ రోడ్డు నందు ఘనంగా జరుపుకున్నారు. .కార్యక్రమంలో హౌసింగ్ సొసైటీ ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, బి.సికాలనీ బావాజాన్, శ్రీకుర్తి శంకర్ రెడ్డి, మోదిన్,రాముమూర్తి పాల్గొన్నారు.**పుల్లంపేట :** మండల పరిధిలోని కొత్తపేట ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో మాజీ రాష్ట్రపతి దివంగత ఎపిజె అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమాన్ని హెచ్ఎం జి.పి హైమావతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సుధారాణి, పూర్ణిమ, మునిలత, విద్యార్థులు పాల్గొన్నారు.

'మిట్స్'లో జాతీయ ఆవిష్కరణ దినోత్సవం

మదనపల్లె :మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో మిట్స్ ఇన్స్టి ట్యూషన్స్ ఇన్నోవేషన్ స్టూడెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జాతీయ ఆవిష్కరణ దినోత్సవం-2025ను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఆర్అండ్‌డి అడ్వైజర్ డాక్టర్ ఆర్. తులసిరామ్ నాయుడు మాట్లాడుతూ భారతదేశ క్షిపణి మనిషిగా ప్రసిద్ధి చెందిన, భారత రత్న గ్రహీత డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం జన్మదినాన్ని పురస్కరిం చుకుని జరుపుకుంటున్నామన్నారు. ఒక దేశం అభివృద్ధి సాధిం చాలంటే ఆవిష్కరణలు కీలకమన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను పెంపొందించడం, కొత్త ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వడం సమాజ అభివృద్ధికి మార్గమని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పి. రామనాథన్, ఐఐసి కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎల్.అనంతరామన్, బి.భాస్కర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధులకు చికిత్స

ప్రజాశక్తి-వీరబల్లి

రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా పాడి పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధులు చికిత్సలు చేయడం జరిగిందని పశు వైద్యాధికారి డాక్టర్ గణేష్ తెలిపా రు. మండల పరిధి లోని గడికోట పంచాయతీలో యడబల్లిలో ఆంధ్ర ప్రదేశ్ పశుగణ అభివృద్ధి సంస్థ సౌజన్యంతో పశు సంవర్థకశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 ఆవులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, 83 పశువులకు పిడుదుల నివారణ మందు పిచికారి చేశారు. 350 గొర్రెలకు, 35 దూడలకు నట్టల నివారణ మందు, 89 సాధారణ చికిత్సలు చేసి సంబంధిత రైతులకు ఎముకల పొడి మినరల్ బ్లాక్ ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. పశుసంవర్ధకశాఖ రాయచోటి ఉపసంచాలకులు డాక్టర్ డి.మాల కొండయ్య మాతృశాఖ తరపున జరుగుతున్న అభివృద్ధి కార్యక్ర మాలను వివరించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి పెయ్య దూడల అభివృద్ధి గురించి వివరించారు. డివిజనల్ కార్యాలయం డాక్టర్ శశికళ గాలికుంటువ్యాధి నివారణ టీకాల గురించి అవగాహన కల్పిం చారు. పొదుగువాపువ్యాధి, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ద్వారా రైతులకు 10 సెంట్లు నుంచి 50సెంట్ల వరకు పశుగ్రాసం వందశాతం రాయితీతో పెంచుకో నవ చ్చని తెలిపారు. కార్యక్రమంలో మండలంలో పనిచేస్తున్న పశు వైద్య సిబ్బంది, పశు సంవర్ధకశాఖ సహాయకులు, గోపాలమిత్ర రవికుమార్ పాల్గొన్నారు.


పశువులకు చికిత్స అందిస్తున్న పశు వైద్య సిబ్బంది

నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు

ప్రజాశక్తి - నందలూరు : రాష్ట్రంలో వైద్యాధికారులు చేస్తున్నటువంటి రాష్ట్ర వ్యాప్త సమ్మెకు మద్దతుగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది మొత్తం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ బుధవారం విధులకు హాజరయ్యారు. విధుల నిర్వహణ సమయంలో ప్రతిరోజూ నల్లబాడ్జిలతో వైద్యాధికారుల డిమాండ్లు నెరవేరే వరకు ఇలాగే విధులు కొనసాగిస్తామని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఒ వెంకటనారాయణ, ఎమ్ఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది


గాలివీడు బస్టాండ్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

డ్రైయినేజీ సమస్యను పరిష్కరించరూ..!

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రమైన గాలివీడు పట్టణంలో గేటు నుంచి బస్టాండ్ వరకు రోడ్డు ఇరువైపులా రెండు మురుగు కాలువలు ఉన్నాయి. వర్షం వచ్చిందంటే గేటు నుంచి బస్టాండ్ వరకు వర్షపు నీరు మురికి కాలువలోకి పోకుండా రోడ్డు పై ప్రవహిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవు తున్నారు. ఆ నీరంతా పెద్దూర్ రోడ్డు ద్వారా మడికయ్యల వైపు వెళ్లే పరిస్థితి ఏర్పడింది. బస్టాండ్ నడిరోడ్డు పైన నీరంతా మడుగులా నిలబడి పోతున్నాయి. పోలీసుస్టేషన్ ఎదురుగా తారు రోడ్డుపైనే నీరు ప్రవహిస్తూ ఉంటుంది. వర్షపు నీరు కాలువల్లోకి పోకుండా ఎవరి ఇంటి దగ్గర వారు రోడ్డు శుభ్రం చేసుకుంటున్నారేగానీ ఆ మురుగునీటిని కాలువలోకి పోవడానికి ఎవరూ ఆస్కారం ఇవ్వక సమస్య అధికమౌతుందని చెబుతున్నారు. కాలువల్లోని మురుగనీంతా వర్షపు నీటితో కలిసి రోడ్డుపై ప్రవహిస్తుండటంతో దుర్వాసనతో భరించ లేకపతున్నామని పేర్కొన్నారు. దోమలు విపరీతంగా వృద్ధి చెందుతుం డటంతో విష జ్వరాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. డ్రెయినేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు దృష్టి పెట్టి వర్షం వచ్చినప్పుడు రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా మురికి కాలువల్లోగుండా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పట్టు పురుగుల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి-రామాపురం : పట్టుపురుగుల పెంపకం చేయాల్సిన రైతులు మల్బరీ సాగుపై అవగాహన కలిగి ఉండాలని పట్టు పరిశోధన విస్తరణ కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రమ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు సేవ కేంద్రంలో బుధవారం మల్బరి సాగు రైతులకు పట్టుపురుగుల పెంపకంపై అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మల్బరీ సాగు చేసే రైతులు ముందుగా మట్టి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. ట్రీ పద్ధతిలోసాగుచేయడం ద్వారా ఆకుల నాణ్యత దిగుబడి మెరుగవుతుందన్నారు. కీటకాలు వ్యాధులు నివారణకు వేప నూనె వినియోగించరున్నారు. డ్రిప్పు స్పింకర్లు వాడకం వల్ల నీటి పొదుపు చేసుకోవచ్చుని, ఉష్ణోగ్రతఆర్ధ్రత నియంత్రణకుతగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. లైన్, విజయత వాడకాని సక్రమంగా పాటించాలని తెలియజేశారు. మల్బరీ సాగు పట్టు పరిశ్రమ ప్రోత్సాహనికి రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహాలు అందిస్తుందని సిరికల్చర్ సహాయ సంచారకులు రాధా పేర్కొన్నారు. మల్బరీ మొక్కలు నాడడానికి ఎకరానికి ఓసి రైతులకు రూ.22,500లు, ఎస్‌సి, ఎస్‌టి రైతులకు రూ.27వేలు ఇస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నాగమణి, రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతుల పాల్గొన్నారు.

అంగన్వాడీల్లో సిడిపిఒ తనిఖీ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : తంబళ్లపల్లె ప్రాజెక్టు పరిధిలో సిడిపిఒ సుజాత అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఎర్రసానివారిపల్లి, తంబళ్లపల్లి -1, తంబళ్లపల్లి -2, కాయలపల్లి, తంబళ్లపల్లి దళితవాడ, కేంద్రాలను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో నమోదైన పిల్లలను అంగన్వాడీ కేంద్రానికి నమోదైన పిల్లలు అందరూ వచ్చే విధంగా కార్యకర్త చొరవ తీసుకోవాలని చెప్పారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,రిజిస్టర్లన్నీ అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. కేంద్రంలో ఉన్న స్టాకు శుభ్రంగా భద్రపచుకోవాలన్నారు. ప్రతినెలా అంగన్వాడీ పరిధిలో ఉన్న పిల్లలను ఎత్తులు, బరువులు తీసి యాప్ లో అప్‌డేట్ చేయాలన్నారు. మెనూ ప్రకారం ఆహారాన్ని అందించాలని తెలిపారు.

క్యాట్ పోటీ పరీక్షలో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-రాయచోటి :క్యాట్-2025 పోటీ పరీక్ష ఫలితాల్లో లెవెల్-2 కు ఎంపికైన 272 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కడప జిల్లా డివిజన్ ఎజి యండి రమణయ్య, ప్రాంతీయ సంచాలకులు పి.మహబూబ్ బాషా బుధవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ స్థానిక ఎస్.ఎస్ కాలనీలోని శ్రీ చైతన్య స్కూల్ నుంచి సెప్టెంబర్ 16న నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్-25కు హాజరైన 560 మంది విద్యార్థుల్లో ప్రతి ఇద్దరిలో ఒకరు లెవెల్-2కు ఎంపికై మరోమారు తమ ప్రతిభను నిరూపించుకున్నారని చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి శ్రీ చైతన్య స్కూల్ రూపొందించిన టెక్నో, సి-బ్యాచ్ వంటి పటిష్టమైన అకాడమిక్ ప్రోగ్రామ్స్, మైక్రో లెవెల్ టీచింగ్, అంకితభావంతో పనిచేసే అధ్యా పకులు కారణమని తెలిపారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

గడ్డి మందు తాగిన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారని ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీ వడ్డిపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు హరీష్ (25) బెంగళూరులో ఓ ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. అతను బెంగళూరు నుంచి వచ్చి మద నపల్లిలో సొంతంగా బ్యాటరీ సంబంధించినటువంటి దుకాణం పెట్టుకుని జీవిం చాలని నిశ్చయించుకున్నారని, ఇదే విషయాన్ని తన తల్లిదండ్రులతో చెప్పగా వారు వద్దు అనడంతో మనస్తాపం చెందిన హరీష్ ఈనెల 5వ తేదీన ఇంటి వద్ద ఉన్న గడ్డి మందును తాగడం జరిగిందన్నారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు అతనికి పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రూయ ఆసుపత్రికి రిఫర్ చేయగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడని చెప్పారు.సదరు విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు కార్మికులు మృత్యువాత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పొట్టకూటి కోసం వలస వచ్చిన బీహార్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు కార్మి కులు సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీలో విద్యుదాఘాతానికి గురై దుర్మరణం చెందారు. ఈ విషాదకర సంఘటన బుధవారం పిటియం మండ లంలో చోటుచేసు కుంది. ఇన్‌ఛార్జి ఎస్ఐ నరసింహుడు తెలిపిన వివరాల మేరకు.. ములకలచెరువు మండలం, బిళ్లూరువాండ్లపల్లెకు చెందిన ఆవుల రాజశేఖర్ పిటిఎం మండలం, కందు కూరులో గత కొంతకాలంగా సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీని నిర్వహిస్తున్నాడు. బీహార్ రాష్ట్రానికి చెందిన ఇంద్రసేన్ సహని (45), గుడ్డు సహాని (32) అనే ఇద్దరు కార్మికులు ఇక్కడికి వలస వచ్చారు. గత నాలుగు నెలలుగా వీళ్లిద్దరూ రాజశేఖర్‌కు చెందిన సిమెంట్ ఇటుకల ఫ్యాక్టరీలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తు న్నారు. యధాప్రకారం బుధవారం ఉదయం ఎలక్ట్రికల్ మిషన్‌లో ఇటుకులను తయారు చేస్తుండగా వైర్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా విద్యుదా ఘాతానికి గురి కావడంతో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెం దారు. సమాచారం తెలుసుకున్న ఇన్‌ఛార్జి ఎస్ఐ నరసింహుడు సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఫ్యాక్టరీ నిర్వాహకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పొట్ట చేతపట్టుకుని బీహార్ రాష్ట్రం నుంచి వలస వచ్చిన కార్మికులు ఇలా విద్యుత్ ప్రమాదానికి గురై మృ త్యువాత పడడంతో కందు కూరులో విషాదఛాయలు అలముకున్నాయి. కుటుంబ పెద్దలను కోల్పోయిన వీరి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


మృతి చెందిన బీహార్ కార్మికులు సహాని, గుడ్డు